# అబద్ధాలకోరు రేవంత్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అభివృద్ధిని జనం సాక్షిగా తప్పుడు ప్రచారం
- కండ్లకు కనిపించడం లేదా అంటూ సోషల్ మీడియాలో ప్రజల ఫైర్
- కాంగ్రెస్‌ను గెలిపిస్తే అభివృద్ధి కుంటుపడుతుందని మండిపాటు
- బీఆర్‌ఎస్‌కే జై కొడుతున్న ప్రజలు

కోస్గి, నవంబర్ 8 : కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రేవంత్‌రెడ్డి అసలు నియోజకవర్గంపై కనీస అవగాహన లేకుండా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని సోషల్ మీడియా వేదికగా ప్రజలు ఫైర్ అవుతున్నారు. 2018లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి చేతిలో రేవంత్‌రెడ్డి ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసేందుకు సోమవారం కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి నామినేషన్ వేసేందుకు వచ్చి మాట్లాడిన మాటలు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి. దౌల్తాబాద్ మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు కాలేదని చెప్పడం, దౌల్తాబాద్‌లో జూనియర్ కాలేజీ ప్రాంభమైన ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టి కొడంగల్‌లో అసలు ఏం జరుగుతుందో కూఆ రేవంత్‌కు తెలియదని ఎద్దేవా చేస్తున్నారు. మహబూబ్‌నగర్- చించోలి నేషనల్ హైవే పనులు పూర్తికాలేదని, కొడంగల్ అభివృద్ధి చెందలేదని, కృష్ణా-వికారాబాద్ రైల్వే లైన్ రాలేదని, నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే రోడ్లు వేశానని ఇలాంటి అబద్ధాలు ప్రచారం చేయడంతో బాహాటంగా ప్రజలు మింగుడుపడడం లేదు. నామినేషన్ వేసి వెళ్లిపోతానని, కార్యకర్తలే గెలిపించాలని చెప్పడం, ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకుంటారనే అపవాదు, ఓటుకు నోటు కేసు, ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం వంటి అంశాలన్నీ రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగానే ఉన్నాయి. అయినప్పటికీ మేక పోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ కాంగ్రెస్ గెలుస్తుందని చెబుతున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పుడిప్పుడే నియోజక వర్గం అభివృద్ధి చెందుతున్నదని, బీఆర్‌ఎస్‌ను కాదని కల్లోల కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునగడం ఖాయమని చెబుతున్నారు. 2018 ఎన్నికల్లో రేవంత్‌రెడ్డిపై పట్నం నరేందర్‌రెడ్డి 10వేల ఓట్ల మెజార్టీతో గెలుపొంది ఐదేండ్లు ప్రజల్లోనే ఉంటూ వారికి కావాల్సిన అభివృద్ధి చేసి చూపించారు. మద్దూర్ మండలంలో కొంతమంది సర్పంచులను డబ్బులిచ్చి కొనుగోలు చేసినా గ్రామ ప్రజలంతా నరేందర్‌రెడ్డి వైపే ఉంటామని చెప్పడంతో కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. కాంగ్రెస్‌లో స్థానికంగా బలమైన నాయకత్వం లేకపోవడం, గుర్నాథ్‌రెడ్డిని ప్రజలు నమ్మకపోవడం వంటి అంశాలతో బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డికి కలిసొచ్చింది. దీనికి తోడు మంత్రి మహేందర్‌రెడ్డి ఇన్‌చార్జిగా వ్యవహరించడం, మంత్రి కేటీఆర్, హరీశ్ రావు, సీఎం కేసీఆర్ నిర్వహించే ప్రచారంతో నరేందర్‌రెడ్డి గెలుపునకు సహకారంగా మారనున్నాయి.

**నేడు కొడంగల్‌కు మంత్రి కేటీఆర్.. పట్నం నరేందర్‌రెడ్డి నామినేషన్‌కు రాక**



కొడంగల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి గురువారం నామినేషన్ వేయనుండగా ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ రానున్నారు. దీంతో బీఆర్‌ఎస్ క్యాడర్‌లో నూతనోత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా బైక్ ర్యాలీ, నామినేషన్‌కు భారీ సంఖ్యలో తరలివచ్చేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కొడంగల్ నియోజకర్గానికి మంత్రి కేటీఆర్ వరాల జల్లు కురిపిస్తారని ఆకాంక్షిస్తున్నారు. కోస్గి రెవెన్యూ డివిజన్‌గా, మద్దూరును మున్సిపాలిటీగా, ఐటీ కంపెనీ వంటి హామీలను కోరనున్నట్లు పట్నం నరేందర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే తెలిపారు.

# సమ్మేళనాల సంబురం

- అన్ని వర్గాలతో మంత్రి నిరంజన్‌రెడ్డి మమేకం
- ప్రభుత్వ పథకాలు వివరిస్తూ.. ప్రతిపక్షాలను విమర్శిస్తూ..
- నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం
- వనపర్తి గులాబీ శ్రేణుల్లో జోష్



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన గౌడ, వడ్డెర కులస్తులు (ఫైల్)

వనపర్తి నవంబర్ 8 (నమస్తే తెలంగాణ) : వనపర్తి నియోజకవర్గంలో ఆత్మీయ సమ్మేళనాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 50కి పైగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడం చూస్తుంటే బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో ఎంతటి నమ్మకం ఏర్పడిందో ఇట్టే అర్థమవుతున్నది. అన్ని రంగాలు, వర్గాల ప్రజలతో మమేకమై సమ్మేళనాలను నియోజకవర్గమంతా దిగ్విజయంగా నిర్వహించారు. దీంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమ్మేళనాల ద్వారా నాయకులు, కార్యకర్తలు,అన్ని వర్గాల ప్రజలకు మరింత చేరువ చేశారు. ఒక్కో సమ్మేళనంలో దాదాపు 2వేలకు పైగా ముఖ్యులు పాల్గొనేలా చేసి కొత్త ఉత్సాహం నింపారు. గ్రామ స్థాయిలో సాధారణ కార్యకర్త నుంచి ముఖ్య నాయకుడి వరకు ఈ సమ్మేళనాలు కదిలించాయి. అభివృద్ధిని గుర్తు చేస్తూ ఇంకా మున్ముందు చేపట్టాల్సిన ముఖ్య పనులను వీటి ద్వారా గుర్తించి వాటికి ఓ రూపం ఇవ్వడంతో నాయకుల్లో మరింత విశ్వాసం పెరిగింది. అలాగే బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేసుకునేలా ఆత్మీయ సమ్మేళనాలు కార్యకర్తలను కార్యోన్ముఖులను చేశాయి.

**ఏడు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో..**

నియోజకవర్గంలోని 7మండలాలతోపాటు రెండు మున్సిపాల్టీల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. దాదాపు ఆరు నెలలకు పైబడి ఈ సమ్మేళన సంబురం అసెంబ్లీ వారీగా కొనసాగింది. పెబ్బేరు, శ్రీరంగాపురం, గోపాల్‌పేట, రేవల్లి, ఖిల్లాఘణపురం, పెద్దమందడి, వనపర్తి మండలాల వారీగా సమ్మేళనాలను నిర్వహించారు. అలాగే వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీల్లోనూ సమ్మేళనాలను నిర్వహించారు. నియోజకవర్గంలో దాదాపు 50వరకు ఆత్మీయ సమ్మేళనాలను చేపట్టారు. మండల స్థాయిలో ఒక సమ్మేళనం నిర్వహించి, ఆయా వర్గాల వారీగా, కులవృత్తుల వారీగా కూడా సమావేశాలను ప్రణాళికతో ఏర్పాటు చేశారు.

**డాక్యుమెంటరీ రూపంలో..**

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అలాగే ప్రత్యేకించి వనపర్తి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై డాక్యుమెంటరీని బీఆర్‌ఎస్ రూపొందించింది. ప్రతిరోజూ ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకుని సాయంత్రం ప్రజలందరినీ సమీకరించి ఎల్‌ఈడీ స్క్రీన్స్ ద్వారా చూపించారు. ఆటపాటలతో కనువిందు చేస్తూ అక్కడికి వచ్చిన ప్రజలందరితో సహఫంక్తిగా భోజనాలు చేస్తూ పథకాలను ప్రచారం చేశారు. అలాగే మున్సిపాలిటీల్లోనూ వార్డుల వారీగా ఎల్‌ఈడీ స్క్రీన్స్‌ను పెట్టి ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల వద్దకు ఓ ప్రత్యేక డ్రైవ్‌గా తీసుకెళ్లడంలో బీఆర్‌ఎస్ సక్సెస్ అయ్యింది.

**అన్ని వర్గాలతో మంత్రి మమేకం..**

ఆత్మీయ సమ్మేళనాలు ప్రారంభమైనప్పటి నుంచి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలతో మమేకమయ్యారు. బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారితో కూడా సాన్నిహిత్యం పెంచుకున్నారు. అలాగే జిల్లా కేంద్రంలో ఆయా వర్గాలు, వృత్తుల వారీగా సమ్మేళనాలు ఏర్పాటు చేసి వారికి అవసరమైన పనులను గుర్తించి అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇలా అవకాశమున్న అన్ని వర్గాల ప్రజలతో ఆత్మీయంగా వెల్లడం ద్వారా మంత్రి సింగిరెడ్డి మరింత చేరువయ్యారు. ఏ ఒక్క కుల సంఘాలను సైతం వదలకుండా సమీకృతంగా కలిసి వాళ్ల అభిమానాన్ని పొందుతున్నారు. వరుస కార్యక్రమాలతో ఏ ఒక్కరోజును బీఆర్‌ఎస్ వదులుకోవడం లేదు. వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ అందరితో మంత్రి సింగిరెడ్డి కలుస్తూ వెళ్లడం వచ్చే ఎన్నికలకు గెలుపుబాటను సూచిస్తున్నది.

# తల తెగిపడ్డా.. బీజేపీతో జతకట్టం

- అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రం సుభిక్షం
- హోంశాఖ మంత్రి మహమూద్ అలీ
- కొత్తకోటలో ముస్లిం మైనార్టీలతో ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న మైనార్టీ నాయకులు

మదనాపురం, నవంబర్ 8 : మతసామరస్యానికి నిలయంగా తెలంగాణ నిలిచిందని, అన్నివర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. కొత్తకోట పట్టణంలోని ఓ గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి హోంమంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతోపాటు దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఎంతో వేధన పడ్డామన్నారు. ముస్లింల పిల్లలు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమై మెకానిక్ షాపుల్లో, హోటళ్లలో పనిచేస్తూ జీవనం కొనసాగించేవారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 11 మైనార్టీ గురుకుల పాఠశాలలు ఉండేవని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ మైనార్టీలకు పెద్దపీట వేశారని తెలిపారు. దీంతో 240పైగా గురుకుల పాఠశాలలను నెలకొల్పి మన పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేశారన్నారు. తెలంగాణలో 17వేల మసీదులు ఉన్నాయని, ఒక్కో మసీదుకు ఇమాం, మౌజామ్‌లకు రూ.5వేల చొప్పున నెలకు రూ.10వేలు అందిస్తున్నట్లు వెల్లడించారు. వారి జీవనభృతికి సాయం అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ మాత్రమేనని గుర్తుచేశారు. తలతెగిపడినా బీజేపీతో జతకట్టేది లేదని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు గొప్పలు చెప్పడం తప్పా చేతల్లో శూన్యమన్నారు. కర్ణాటకలో గెలించేందుకు అక్కడి ముస్లింలకు ఎన్నో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక వారిని నిండా ముంచిందని తెలిపారు. ఒక్క ముస్లీంలనే కాకుండా అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో ఆసరా ఫించన్లు రూ.200 వందలు ఉండగా, సీఎం కేసీఆర్ 10రెట్లు పెంచి రూ.2016 ఇచ్చారన్నారు. రానున్న రోజుల్లో రూ.5వేల వరకు పెంచేందుకు ప్రణాళికలు రూపొందించారన్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గానికి ప్రజల ఆశీర్వాదంతో రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేశానని, మరోసారి ఆదరిస్తే సేవకుడిగా మరింత సేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని విశ్వేశ్వర్, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, ఇబ్రహీం, ఎంఐఎం నాయకులు జుబేర్ బిన్ సయ్యద్, అబ్దుల్ ఖదీర్, మునీర్, మహెమూద్, అలీం, ఖాజా, వసీం, ఘని తదితరులు పాల్గొన్నారు.



హోంమంత్రి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

**బీఆర్‌ఎస్‌తోనే సుస్థిరపాలన..**

ఊట్కూర్, (మక్తల్) నవంబర్ 8 : ముస్లిం మైనార్టీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, సుస్థిర పాలన బీఆర్‌ఎస్‌కే సాధ్యమని హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ అన్నారు. బుధవారం మక్తల్ పట్టణంలోని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో హైదరాబాద్‌లో ఎలాంటి మత ఘర్షణలు, కర్ఫ్యూలు లేకుండా ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే ముస్లింలకు అన్ని హక్కులు, సౌకర్యాలు లభిస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్‌ను తెలంగాణ పితగా కొనియాడారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ రూ.2,200 కోట్లు ఖర్చు పెట్టినట్లు గుర్తుచేశారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాలు, కుల మతాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఓటుకు నోటు కేసులో జైలుకెళ్లిన దొంగ రేవంత్‌రెడ్డి తెలంగాణ కోసం ప్రాణాలు సైతం లెక్కచేయని సీఎం కేసీఆర్‌ను నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అలాగే నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితో కలిసి ప్రచారంలో హోంమంత్రి పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరికలు..**

కొత్తకోట, నవంబర్ 8 : కొత్తకోటకు చెందిన కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నాయకులు హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో గఫార్, ఖాజామైనొద్దీ, జహీర్, మోసిన్, రియాజుద్దీన్, అమీర్‌తో పాటు 100మంది ఉన్నారు.

**హోంమంత్రి, ఎమ్మెల్యే వాహనాల తనిఖీ..**

హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వాహనాలను బుధవారం కనిమెట్ట చెక్‌పోస్టు వద్ద ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. కొత్తకోట మైనార్టీ ఆత్మీయ సమ్మేళానికి వస్తుండగా, వాహనాలను ఆపి తనిఖీ చేసినట్లు పెద్దమందడి ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.